# అమెరికా లొంగుబాటు సంబంధాలకు పాకిస్థాన్ ముగింపు పలకాలి




**గత** కొంతకాలంగా పాకిస్థాన్ పట్ల అమెరికా అంతసంతృప్తిగా లేదు. ఇటీవల పాకిస్థాన్‌పై అమెరికా ఒక ఆరోపణ చేసింది: "గత 15 సంవత్సరాలలో అమెరికా పాకిస్థాన్‌కు 3,300 కోట్ల డాలర్లకు పైగా సహాయాన్ని కళ్ళు మూసుకొని మరీ అందిస్తే, తిరిగి అబద్ధాలు, మోసాలు, తప్ప వారు మాకే మిచ్చారు? పాకిస్థాన్ మా నాయకులను అవివేకులుగా భావిస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌లో మేము తీవ్రవాదులను వేటాడుతుంటే కనీస సహాయం చేయకపోగా ఆ తీవ్రవాదులకు స్థావరాలను ఏర్పాటు చేస్తుంది." ఈ ఆరోపణ ద్వారా పాకిస్థాన్ పట్ల అమెరికాకున్న అసంతృప్తిని తెలుసుకోవచ్చు. 2018 జనవరి మొదటివారంలో ఆఫ్ఘన్ తాలిబాన్ల పట్ల, హక్కాని నెట్‌వర్క్ తదితర తీవ్రవాద సంస్థలపట్ల నిర్ణయాత్మకమైన చర్యలు చేపట్టే వరకు పాకిస్థాన్‌కు భద్రతాపరమైన సహాయాన్ని భారీగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

ఈ మార్పును అర్థం చేసుకోవాలంటే అమెరికా – పాకిస్థాన్ సంబంధాలను లోతుగా అవగాహన చేసుకోవాల్సిన అవసరముంది.

గత ఏడు దశాబ్దాలుగా పాకిస్థాన్‌లో అనేక ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి; అధికారం కోల్పోయాయి. కాని పాకిస్థాన్ పాలకులందరూ ఎప్పుడూ సామ్రాజ్య వాదులకు, మరీ ముఖ్యంగా అమెరికాకు లొంగే వున్నారు. పాకిస్థాన్ అమెరికాకు నాటో యేతర ప్రధానమైన భాగస్వామిగా నిలిచింది. ఈ ప్రాంతంలో అమెరికా ఆధిపత్య విధానాల అమలులో పాకిస్థాన్ పూర్తి సేవలను అందించింది. ఇస్లామిక్ తీవ్రవాద ముఠాలను ఏర్పరచి వాటిని అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా పని చేయించడంలో పాకిస్థాన్, అమెరికా సామ్రాజ్య వాదానికి ఎంతో దోహదపడింది. కాబూల్‌లోని సోవియట్ అనుకూల ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఆఫ్ఘనిస్తాన్‌లోని ముజాహిద్దీన్‌లను సంఘటిత పరచి ఉసిగొల్పడంలో అమెరికా సామ్రాజ్య వాదానికి పాకిస్థాన్ పాలకులు ప్రధాన సాధనంగా పనిచేశారు. ఈ విషయం ప్రపంచానికంతటికీ తెలుసు. అంతేకాదు. అమెరికా 2001లో ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ యుద్ధానికి పాల్పడి నపుడు పాకిస్థాన్ తన సేవలనందించడంలో ఏమాత్రం సంకోచించలేదు. పదహారేళ్ళ ఆఫ్ఘన్ యుద్ధంలో వేలాది అమాయక ఆఫ్ఘన్ ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయారు. లక్షలాదిమంది తమ ఇళ్ళను వదిలి వెళ్ళిపోవాల్సి వచ్చింది. ఆఫ్ఘనిస్థాన్‌పై జరిగిన ఈ దురాక్రమణ యుద్ధంలో అమెరికాకు సహాయమందించడంలో పాకిస్థాన్ నిస్సిగ్గుగా వ్యవహరించింది. పాకిస్థాన్ పాలకులు తమ ప్రాంతాలను వాడుకోడానికి, రవాణా వ్యవస్థలను, వనరులను ఉపయోగించు కోడానికి అమెరికాకు పూర్తి అనుమతినిచ్చారు. తాలిబాన్లను తుదముట్టించడానికి వారి సురక్షిత స్థావరాలను నాశనం చేయడానికనే సాకుతో పాకిస్థాన్ భూభాగాలపై అమెరికా బాంబులు జారవిడిచినా, డ్రోన్ దాడులను నిర్వహించినా పాకిస్థాన్ కిమ్మనలేదు. ఈ విధమైన పాత్రను పోషిస్తూ అమెరికాకు తొత్తుగా వ్యవహరించడంలో పాకిస్థాన్ తనకుతానే సాటిగా నిలిచింది.

ఇది మొత్తం కథకు ఒక పార్శ్వం మాత్రమే. ఆసియా – పసిఫిక్ ప్రాంతమంతటా అమెరికా తన ఆధిపత్యాన్ని నిలుపుకోవాలనే సుదూర లక్ష్యాన్ని ఎత్తుగడను సాకారం చేసుకోవడమనేది రెండో పార్శ్వం. ఈ లక్ష్య సాధనా మార్గంలో చైనాను ఒక బలమైన ఆటంకంగా అమెరికా పరిగణిస్తోంది. అందుకు చైనాను ఒంటరి చేసి, దాన్ని దిగ్బంధం చేయాలనేదే ఈ ఎత్తుగడలోని ప్రధానమైన అంశం. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల సైనిక భాగస్వామ్య ఒప్పందాలకు ఒక రూపం యివ్వడానికి అమెరికా వరుస చర్యలను చేపట్టింది. భారత పాలకులను కూడా ఈ మైత్రీ ఒప్పందంలోకి లాగింది. అమెరికా తన ఆధిపత్య రాజకీయాల ద్వారా భారత దేశానికున్న సువిశాల ప్రాంతాలను, వనరులను వాడుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఇదంతా చేసింది. దాని ఎత్తుగడలలో భాగంగా భారతదేశానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. భారత పాలకులు తమవంతుగా అమెరికా యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు దిగడానికి వీలుగా భారత ఓడ రేవులను, సైనిక స్థావరాలను అనుమతించారు. హిందూ మహాసముద్రంలో చైనా యుద్ధ నౌకలు, జలాంతర్గాముల కదలికలను గమనించడానికి పెంటగన్‌తోబాటు రహస్య సమాచారాన్ని పంచుకోవడానికి అంగీకరించారు. దక్షిణ చైనా సముద్ర వివాదంపై, అలాగే ఉత్తర కొరియాపైనా గానీ అమెరికా వైఖరులను భారతదేశం చిలుక పలుకుల్లాగా వల్లిస్తోంది.

ట్రంప్ కాలంలో భారత్ అమెరికా సంబంధాలు కొత్త స్థాయికి చేరాయి. 2017 అక్టోబర్‌లో అమెరికా స్టేట్ సెక్రటరీ రెక్స్ టిల్లర్సన్ ఇలా అన్నాడు: "భారత దేశంతో మా సంబంధం.... భద్రతా ప్రాముఖ్యం కలది. అది కేవలం ఈ ప్రాంతానికే పరిమితమైంది కాదు. జపాన్ నుండి భారతదేశం వరకు విస్తరించివున్న ప్రాంతాన్ని స్వేచ్ఛాయుత హిందూ–పసిఫిక్ ప్రాంతంగా చేయడానికి ఉద్దేశించబడినది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికా తన ఆధిపత్య రాజకీయాలను అమలు చేయడానికి ఒక సాధనంగా వుపయోగపడేటట్లు తన నాయకత్వాన అమెరికా – జపాన్ – ఆస్ట్రేలియాలతో కీలక సైనిక భాగస్వామ్య కూటమినేర్పాటు చేసింది. దీనిని 'క్వాడ్' అంటారు. ఈ క్వాడ్‌లోకి భారత్‌ను లాగడానికి అమెరికా ప్రాధాన్యత నిచ్చింది. అతి త్వరితంగా అభివృద్ధి చెందుతున్న అమెరికా భారత్ కీలక సంబంధాలను పాకిస్థాన్ పాలకులు గమనిస్తున్నారు.

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఒక ప్రధానమైన, బలమైన శక్తిగా ఎదిగిన చైనాతో తమ సంబంధా లను మరింత పెంచుకోడానికి పాకిస్థాన్ పాలకులు మొగ్గు చూపారు. చైనా, పాకిస్థాన్‌ల మధ్య రవాణా మౌలిక వసతులను ఏర్పాటు చేయడానికి ఉద్దేశించబడిన 5,700 కోట్ల డాలర్ల చైనా పాకిస్థాన్ ఎనకమిక్ కారిడార్ (CPEC)లో పాకిస్థాన్ పాలకులు భాగస్వాములయ్యారు. ఈ పథకం చైనాను గ్వాదర్‌లోని అరేబియా ఓడరేవుతో అనుసంధానిస్తుంది. ఐరోపా, మధ్యఆసియా మరియు ఆఫ్రికా దేశాలతో చైనా తన ఆర్థిక సంబంధాలను విస్తృతపరచుకోడానికి రూపొం దించిన వన్ బెల్ట్, వన్ రోడ్ (OBOR) అనబడే సమగ్ర పథకంలో ఈ సిపిఇసి ఒక భాగం.

సహజంగానే ఈ పరిణామం అమెరికాకు ఆమోదయోగ్యంగా లేదు. ఎందుకంటే ఇది తన ప్రత్యర్థియైన చైనాను బలోపేతం చేస్తుంది. అంతేకాదు చైనాతో పాకిస్థాన్ స్నేహ సంబంధా లను దృఢపరుస్తుంది. అందువల్ల ఇప్పుడు పాకిస్థాన్ పాలకుల ఈ దిశను ఎలా మళ్ళించాలి?, దృఢమవుతున్న చైనా, పాకిస్థాన్ సంబంధాల వల్ల వచ్చే పరిణామాలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలు అమెరికాకు తీవ్ర ఆందోళనకరంగా మారాయి.

అంతేకాదు, ఆఫ్ఘనిస్తాన్‌పై చేసిన దురాక్రమణ యుద్ధం ద్వారా అమెరికా తాను ఆశించిన లాభాలను పొందలేదనేది కూడా మరో పరిణామం.

ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా తన సైన్యాలను ఉపసంహరించుకుంటున్నట్లు, ఒబామా ప్రకటించి నప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌లో ఒక ప్రభుత్వం వున్నప్పటికీ అది ప్రజల మన్ననలను ఏమాత్రం పొందినది కాదు. అధిక ప్రాంతం తాలిబన్ల నియంత్రణలోనే వుంది. అమెరికా నుండి తిరిగి వెనక్కి వచ్చిన మిలటరీ అధికారులు మార్గ దర్శకత్వాన్ని, సహాయాన్ని అందించినప్పటికీ ఆఫ్ఘన్ సైన్యం తాలిబన్ల దాడుల్లో అనేక ఓటములను, నష్టాలను చవిచూసింది. తాలిబన్లలో మంచి తాలిబన్లు, చెడ్డ తాలిబన్లు అనే వర్గీకరణతో అమెరికా చేపట్టిన దౌత్య నీతి కూడా దారుణంగా విఫలమైంది. ఆవిధంగా ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టేనాటికి అమెరికా ఆఫ్ఘనిస్తాన్ విధానం సంక్షోభ స్థితిలో వుంది. మరోవైపు అమెరికా ఆఫ్ఘనిస్థాన్‌లో ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులను ఆసరా చేసుకొని చైనాతో సహా ఇతర శక్తులు, ఆఫ్ఘనిస్తాన్‌లో ఆర్థికంగా, రాజకీయంగా తమ ప్రాబల్యాన్ని పెంచుకోడానికి తమ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి.

ఈ వెలుగులోనే 2017 ఆగస్టులో ఆఫ్ఘనిస్తాన్ పట్ల ట్రంప్ కొత్త సైనిక విధానం వచ్చింది. ఈ విధానం ఆఫ్ఘనిస్తాన్‌ను శాశ్వతంగా తన ఆక్రమణలో వుంచుకోవడానికి, సైనిక చర్యలను తీవ్రతరం చేయడానికి ఉద్దేశించబడింది. దీనికి అనుగుణంగానే ఆఫ్ఘనిస్తాన్‌పై 'మదర్ ఆఫ్ బాంబ్స్' ను ప్రయోగించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సైన్యాన్ని మరింతగా మోహరించడం, ఆఫ్ఘనిస్తాన్‌లో భారత్ పాత్రను పెంచటం, తాలిబన్‌లకు వ్యతిరేకంగా పాకిస్థాన్ పటిష్టమైన చర్యలను చేపట్టడంలేదనే ఆరోపణలు చెయ్యడం, యివన్నీ ఈ కొత్త విధాన నేపథ్యం నుండి వచ్చినవే.

పాకిస్థాన్ పాలకులు తమ అనుభవాల ద్వారా ఒక విషయాన్ని స్పష్టంగా చూడగలిగారు. అమెరికా తమకిచ్చే గుర్తింపు, ప్రాధాన్యతా స్థానం అమెరికా ఆధిపత్య రాజకీయాలకు తాము చేసే సేవను బట్టే వుంటుందని పాకిస్థాన్ పాలకులు గమనించారు. అందుకే అమెరికాతో తమ సంబంధాలను కొనసాగిస్తూనే చైనాను విశ్వసనీయ శక్తిగా పరిగణించి దానితో సంబంధాలను అభివృద్ధి చేసుకున్నారు.

పాకిస్థాన్‌పై తన విమర్శను ఆఫ్ఘనిస్తాన్ అంశానికే అమెరికా పరిమితం చేసినప్పటికీ, అమెరికా, పాకిస్థాన్ పాలకుల మధ్య పెరుగు తున్న అగాధానికి పైన పేర్కొన్న పరిణామాలు కూడా వాటి ప్రభావాన్ని అవి చూపాయి.

అమెరికా సూటిగా, ఖచ్చితంగా ఇలా ప్రశ్నిస్తోంది: 'ఆఫ్ఘన్ తాలిబాన్లకు, హక్కాని నెట్‌వర్క్ లాంటి తీవ్రవాద సంస్థలను నిర్వీర్యం చేయడానికి మేము మీకు డబ్బులిచ్చాం. కాని మీరు ఆ పనిని ప్రభావవంతంగా చేయడంలేదు. అలాంటప్పుడు మేము మీకు డబ్బులెందు కివ్వాలి?' ఇదీ అమెరికా ప్రశ్న.

దీనికి బదులుగా పాకిస్థాన్ నాయకులు ఇలా అంటున్నారు: 'ఆఫ్ఘనిస్థాన్‌లో సమిష్టి వైఫల్యానికి అమెరికా పాకిస్థాన్‌ను నిందిస్తోంది. పాకిస్థాన్ చేసిన అనేక త్యాగాలను ఊహాజనితంగా డబ్బు రూపంలో విలువకట్టి వాటి ప్రాధాన్యతను తగ్గిస్తున్నారు. తీవ్రవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ద్వైపాక్షిక సహకారం, అమెరికా జాతీయ భద్రతా ప్రయోజనాలకేగాక అంతర్జాతీయ సమాజ విశాల ప్రయోజనాలకు కూడా దోహద పడింది. శాంతి స్థాపనకు పనిచేసే క్రమంలో పరస్పర గౌరవం, పరస్పర విశ్వాసం, ఓర్పు, పట్టువదలకుండా పనిచేయడం అవసరం' అని పాకిస్థాన్ పాలకులు అంటున్నారు. పాకిస్థాన్ ప్రతిపక్ష నాయకుడు అమెరికాకు

వ్యతిరేకంగా తీవ్రంగా ప్రతిస్పందించాడు. అమెరికా సామ్రాజ్య వాదుల వైఖరికి వ్యతిరేకంగా నిరసనలు తెల్పడానికి పాకిస్థాన్ ప్రజలు కూడా విస్తృతంగా వీధుల్లోకి వచ్చారు.

పాకిస్థాన్ పాలకులు అమెరికా సామ్రాజ్య వాదులతో తమ సంబంధాలను పునఃసమీక్షించు కోవడానికి, పునర్నిర్మించుకోవడానికి ఇది సరైన సమయం. దక్షిణాసియాపై అమెరికా తన ఆధిపత్యాన్ని రుద్దడానికి అనుసరించిన ఎత్తుగడల్లో, అమెరికా సామ్రాజ్యవాదులకు పాకిస్థాన్ ఒక సాధనంగా పనిచేసిందనేది వాస్తవం. ఆఫ్ఘనిస్తాన్‌లో కూడా ఆఫ్ఘన్ ప్రజల హక్కులను క్రూరంగా కాల రాయడానికి అమెరికా సామ్రాజ్యవాదులకు వీరు సహాయపడ్డారు. ఈ క్రమంలో అణచివేత దారులకు వీరు కిరాయికి పనిచేసేవారుగా తమను తాము కుదించుకున్నారు. అణచబడిన దేశమైన పాకిస్థాన్–ఆఫ్ఘనిస్థాన్ లాంటి మరొక అణచబడ్డ దేశాన్ని అణగద్రొక్కుతున్న సామ్రాజ్యవాద దురాక్రమణదారునికి సహాయం చేయడమనేది చాలా సిగ్గుపడాల్సిన అంశం. కాబట్టి సామ్రాజ్యవాదుల సేవలో తరిస్తూ తమ త్యాగాలకు గుర్తింపు కొరకు దేబిరించడం మానేసి, లజ్జా కరమైన గతం నుండి శాశ్వతంగా విడిపోయి కొత్తపుంతలు తొక్కాలని పాకిస్థాన్ ప్రజలు, ప్రపంచ ప్రజలు పాకిస్థాన్ నుండి ఆశిస్తున్నారు.

అమెరికా, పాకిస్థాన్‌ల మధ్య పెరుగుతున్న దూరాన్ని చూసి భారత పాలకులు సంతోషిస్తున్నట్లు కన్పిస్తుంది. కాని భారత పాలకులు అమెరికాతో ఏర్పర్చుకుంటున్న సంబంధాలు, మౌలికంగా పాకిస్థాన్ అమెరికా సంబంధాలకు భిన్నంగా లేవు. ఈ సంబంధాలు అసమానత్వ ప్రాతి పదికపై లొంగుబాటు విధానంతో వున్నాయి. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ఆధిపత్యం రుద్దడానికి ఉద్దేశించబడినవిగానే వున్నాయి. ఈ పాత్రను పోషించడానికి అంగీకరించడమంటే భారతదేశానికి, భారత ప్రజలకు ఒక దరిద్రపు భవిష్యత్తును ఆహ్వానించడమే అవుతుంది. భారత ప్రజలు ఈ రకమైన భారత–అమెరికా సంబంధాలను పూర్తిగా వ్యతిరేకిస్తారు. ఇప్పటికే ఈ సంబంధాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తున్నారు.

ooooo